క్లుప్తంగా

నేడు, రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాజోలు: కొత్తగా రాజోలు 33 కేవీ విద్యుత్ లైన్ నిర్మాణ పనుల కోసం ఈ నెల రెండు, మూడు తేదీల్లో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఏఈ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఈ నెల రెండున శివకోడు, మూడున రాజోలు మండలంలోని శివకోడు, శివకోడుపాలెం, పొన్నమండ, వేగివారిపాలెం, బి.సావరం, గెద్దాడ, పాలగుమ్మి, తాటిపాక, పొదలాడ, సోంపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు. అమలాపురం ఈఈ ఎం.రవికుమార్ ఆదేశాల మేరకు ఈ మరమ్మతులు చేపట్టామన్నారు.

జగన్‌ను సీఎం చేయడమే లక్ష్యం


కత్తిమండలో రాపాకను కలిసిన శాంతికుమారి

మలికిపురం: వచ్చే ఎన్నికలలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని సఖినేటిపల్లి, మామిడికుదురు మండలాల డ్వాక్రా మాజీ కో–ఆర్డినేటరు ఎస్.శాంతికుమారి అన్నారు. బుధవారం ఆమె కత్తిమండలోని అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించారు. రాపాకతో పాటు, రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అఖండ మెజార్టీతో గెలుస్తారన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం


దాత కుటుంబానికి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదానం ట్రస్టుకు అంబాజీపేట మండలం ముక్కామలకు చెందిన మొగలి సత్యానారాయణ, కాంతం దంపతులు బుధవారం రూ.52,101 విరాళంగా అందించారు. ఈ మొత్తాన్ని వారు తమ మనవడు మొగలి గౌతమ్ పుట్టిన రోజు సందర్భంగా ఆలయ అధికారులకు అందజేశారని ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. దాత కుటుంబానికి అర్చకులు స్వామి వారి ఆశీర్వచనాలు అందించారు. స్వామి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

30 మంది వలంటీర్ల రాజీనామా


పెదపట్నంలంకలో రాజీనామా పత్రాలు ప్రదర్శిస్తున్న వలంటీర్లు

మామిడికుదురు: పెదపట్నంలంక సచివాలయం–1, 2కు చెందిన 30 మంది వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. గ్రామ వలంటీర్లుగా సేవలందిస్తున్న తమ మనోభావాలను దెబ్బ తీసేలా చంద్రబాబు, పవన్ మాట్లాడ్డం దారుణమని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావుకు మద్దతుగా తాము ఎన్నికల ప్రచారం చేస్తామన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ


ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

అయినవిల్లి: గ్రామాల్లో ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని రెవెన్యూ అధికారులు బుధవారం ప్రారంభించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలంలోని 21 గ్రామాల్లో రెవెన్యూ అధికారులు వీటిని త్వరితగతిన పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

జూదరుల అరెస్టు

రావులపాలెం: గౌతమి గోదావరి లంక ప్రాంతంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.23,100 నగదు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఎం.ఆంజనేయులు బుధవారం తెలిపారు. ఎస్సై రాజేష్ కేసు నమోదు చేశారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీశంకర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వాస్పత్రిలో సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలను అందజేశారు.

సేవల గుడి


కొత్తపేటలో కొత్త పింఛనుదారులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి (ఫైల్)

- సచివాలయాలతో ప్రయోజనాలెన్నో..
- నాడు పడిగాపులు.. నేడు ఇంటి గడపకే సర్కారు సేవలు
- సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు మేలు
- నియోజకవర్గంలో మారిన జీవన స్థితిగతులు

కొత్తపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. ప్రభుత్వ పాలన ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలందాయి. పింఛను కావాలన్నా, రేషన్ కార్డు కావాలన్నా, ఇంటి స్థలం, ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నా, మరే ఇతర ప్రభుత్వ అవసరాలకు లబ్ధిదారులు, ఆయా దరఖాస్తుదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పోయింది.

వైఎస్సార్ సీపీ పాలన దేశానికే ఆదర్శం

టీడీపీ ప్రభుత్వ హయాంలో కుల, జనన, ఆదాయ ధ్రువపత్రాలు కూడా సకాలంలో అందేవికావు. నెలల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. దీంతో విద్యార్థులు వివిధ అవకాశాలు కూడా కోల్పోయేవారు. సామాజిక పింఛనుదారులు పింఛను కోసం నానా అవస్థలు పడేవారు. రేషన్‌కార్డులు పొందాలంటే ఇబ్బందులు, రేషన్ కార్డు ఉంటే రేషన్ కోసం కూడా ఇబ్బందులే. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా అన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయి. మహాత్మా గాంధీ గ్రామ స్వరాజ్యం కలను సాకారం చేసేందుకు 2019 అక్టోబర్ రెండున ఆ వ్యవస్థల ద్వారా దేశ చరిత్రలోనే సరికొత్త పాలనకు శ్రీకారం చుట్టారు. పార్టీ రహితంగా పేదరికమే ప్రామాణికంగా, అవినీతికి తావు లేకుండా పరిపాలన సాగింది. దీంతో దేశం మొత్తం ఏపీ వైపు చూసింది. పలు రాష్ట్రాలు ఏపీ పథకాలను ఆదర్శంగా తీసుకున్నాయి.

వలంటీర్లే ప్రజా సేవకులు

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా వలంటీర్లు సేవలందించారు. కుల, మత, వర్గ, రాజకీయాలకతీతంగా అవినీతికి అవకాశం లేకుండా,


టీడీపీ హయాంలో కొత్తపేట పంచాయతీ వద్ద పడిగాపులు పడుతున్న పింఛనుదారులు (ఫైల్)

ప్రజలకు నేరుగా పథకాలు అందించాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం మేరకు వలంటీర్లు పనిచేశారు. ఎండ, వాన, తుపాను, వరదలే కాదు కరోనా మహమ్మారిని సైతం లెక్క చేయకుండా సేవలందించారు. గత టీడీపీ పాలనలో పింఛను కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పంచాయతీల వద్ద రోజుల తరబడి పడిగాపులు పడేవారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టినప్పటి నుంచీ వలంటీర్లు ప్రతి నెలా ఒకటిన తెల్లవారుజామునే తలుపు తట్టి పింఛన్లు అందచేశారు. తద్వారా ప్రజాభిమానం చూరగొన్నారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టీడీపీ అండ్ కో ఫిర్యాదు మేరకు వలంటీర్లు విధులకు దూరం కావాల్సి వచ్చింది. దానితో పింఛనుదారులకు మళ్లీ తిప్పలు తప్పలేదు. గత నెల పింఛనుకు సచివాలయాల వద్దకు, ఈ నెల పింఛను కోసం బ్యాంకులకు వెళ్లాల్సి వస్తోంది.


కొత్తపేట పింఛనుదారుకు పారుగూరు వెళ్లి పింఛను అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)



వాడపాలెం గ్రామ సచివాలయ భవనం

సేవలన్నీ ఒకేచోట

నియోజకవర్గంలో 57 గ్రామ పంచాయతీలు కాగా, వాటిని 87 సచివాలయాలుగా విభజించారు. వాటి ద్వారా అన్ని ప్రభుత్వ శాఖలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలతో పాటు అనేక పథకాలు, పౌర సేవలను ఈ సచివాలయాల ద్వారా అందిస్తోంది. ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఆయా పథకాలు లబ్ధిదారుల ఖాతాలకు విడుదలయ్యాయి.

రూ.2,250 కోట్ల లబ్ధి, రూ 680 కోట్లతో అభివృద్ధి

నియోజకవర్గ పరిధిలోని ఒక్కో లబ్ధిదారునికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలు 2 నుంచి 6 వర్తించగా, ప్రత్యక్ష నగదు బదిలీ, పరోక్ష నగదు బదిలీ రూపంలో 6,33,331 ప్రయోజనాలు రూపంలో సుమారు రూ.2,250 కోట్లు లబ్ధి చేకూరింది. సుమారు రూ.680 కోట్లతో ఆర్అండ్‌బీ, పీఆర్ బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, జల్‌జీవన్ మిషన్ ద్వారా రక్షిత మంచినీటి పథకాలు, సచివాలయాలు, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్లు, బల్క్ మిల్క్ సెంటర్లు నిర్మాణం, నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల భవనాలు, ఆస్పత్రుల ఆధునీకరణ వంటివి జరిగాయి.

మరోసారి ఫ్యాన్ ప్రభంజనం

- అమలాపురం ఎంపీ, కొత్తపేట అసెంబ్లీ అభ్యర్థులు రాపాక, జగ్గిరెడ్డి
- కొత్తపేట మండలంలో జోరుగా వైఎస్సార్ సీపీ ప్రచారం


మోడేకుర్రులో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రాపాక, జగ్గిరెడ్డి

కొత్తపేట: సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో మరోసారి ఫ్యాన్ ప్రభంజనం సృష్టించబోతోందని వైఎస్సార్ సీపీ అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి రాపాక వరప్రసాద్, కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మోడేకుర్రు, అవిడి గ్రామాల్లో పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులు రాపాక, చిర్ల ప్రచారం చేసి ఓట్లు అభ్యర్థించారు. వారికి అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ప్రచార రథానికి ముందు పార్టీ శ్రేణులు, అభిమానుల మోటార్ సైకిల్ ర్యాలీగా సాగిన ఈ ప్రచారం విజయోత్సవాన్ని తలపించింది. మోడేకుర్రు వద్ద అమలాపురం–రావులపాలెం ప్రధాన రహదారి వద్దకు భారీగా మోటార్ బైక్‌లపై వచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు, బాణసంచా కాల్పులు, పూలవర్షం కురిపిస్తూ అభ్యర్థులను తోడ్కొని వెళ్లారు. పలుచోట్ల ప్రజలు పూలమాలలు, గజమాలలతో సత్కరించారు. మహిళలు హారతులిచ్చి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వరప్రసాద్, జగ్గిరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆదరణ, అభిమానం చూస్తుంటే అత్యధిక మెజార్టీతో తమ విజయం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్ని పార్టీలు కలిసినా, వైఎస్సార్‌సీపీ ఘన విజయాన్ని ఆపలేరన్నారు. 2014లో నోటికొచ్చిన హామీలిచ్చి, తీరా అధికారం చేపట్టాక వాటిని గాలికొదిలేసిన చంద్రబాబు మోసాన్ని ప్రజలు మరచిపోలేదన్నారు. మళ్లీ నిసిగ్గుగా కూటమితో కలిసి హామీలు ఇస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. నీతి, నిజాయితీగా, పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ప్రధాన అజెండాగా పాలన సాగించి, వారి కుటుంబాల్లో వెలుగులు నింపిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితే ఆయా వర్గాల ప్రజల జీవన స్థితిగతులు పూర్తిగా మెరుగుపడతాయన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన నవరత్నాలతో పాటు, ఇవ్వని మరెన్నో హామీలు అమలు చేసిన నైజం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని అన్నారు. భవిష్యత్తులో ఆయా పథకాలను కొనసాగిస్తూ, మరికొన్ని పథకాల మొత్తాన్ని పెంచనున్నట్టు మేనిఫెస్టోలో పేర్కొన్నారన్నారు. ప్రచారంలో అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ రెడ్డి రవీదేవి, సర్పంచ్‌లు కుడుపూడి రామలక్ష్మి, రెడ్డి చంటి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఎంపీటీసీలు నేతల వెంకటలక్ష్మి, దూళి సూరిబాబు, గ్రామ అధ్యక్షులు మామిడిశెట్టి ఏడుకొండలు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే పేదల సంక్షేమం

పార్టీలో చేరిన జనసేన, టీడీపీ శ్రేణులు


వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం ముడిపడి ఉందని నమ్మి ఈ పార్టీలో చేరామని పలువురు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు తెలిపారు. జనసేన కొత్తపేట మండల శాఖ మాజీ అధ్యక్షుడు అంబటి పరమేశ్వరరావు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, కార్మిక నాయకుడు కేవీ రమణ, కముజు సత్యనారాయణ, తరిట్ల వరప్రసాదరావు, కంఠంశెట్టి లక్ష్మణరావు, పెచ్చెట్టి శ్రీనివాసరావు, నెల్లి జగన్‌బున్ను, నల్లా రామకృష్ణ తదితర 15 మంది ఆయా పార్టీలకు రాజీనామా చేసి, రావులపాలెం సీఆర్‌సీలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. వీరికి ఆయన పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ గతంలో పథకాల కోసం నాయకులు, అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎవరి సిఫార్సులతో పని లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే జమ చేయడం ద్వారా ఆయన చరిత్ర సృష్టించారన్నారు. నియోజకవర్గంలో గతంలో ఎమ్మెల్యేలకు పూర్తి భిన్నంగా జగ్గిరెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను పరిష్కరించి, సంతృప్తిగా సాగనంపడం తమకు నచ్చిందని, అందుకే ఆయనకు మద్దతుగా పార్టీలో చేరామన్నారు. ఆయన విజయానికి కృషి చేస్తామని మాటివ్వగా, అందుకు జగ్గిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల సేవాదళ్ అధ్యక్షుడు గూడపాటి ప్రవీణ్‌కుమార్, పార్టీ నాయకులు పెదపూడి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మే డే వేడుకలు

కొత్తపేట: కార్మికులకు ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ఏపూరి నరసన్న పిలుపునిచ్చారు. మేడే వేడుకలను బుధవారం స్థానిక భవన నిర్మాణ కార్మిక సంఘ భవనం వద్ద సంఘ అధ్యక్షుడు ఏపూరి నరసన్న కార్మిక పతాకాన్ని ఆవిష్కరించారు. స్థానిక యూటీఎఫ్ స్థూపం వద్ద యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మే డే దినోత్సవం నిర్వహించారు.

అంబాజీపేట: తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ, ఆశా, 108, 104, మిడ్డేమీల్స్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముక్కామల, మాచవరం, కె.పెదపూడి తదితర గ్రామాల్లో తాపీమేస్త్రీ, కొబ్బరి వలుపు, దింపు తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిగాయి.

రాజోలు: రాజోలు, తాటిపాక, పొదలాడ, శివకోడు, చింతలపల్లి, కడలి గ్రామాల్లో వివిధ కార్మిక సంఘాల నాయకులు మేడే ఉత్సవాలను నిర్వహించారు. కుంతలేశ్వరి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో, తాటిపాకలో రాజోలు తాలూకా భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో రాజోలు వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు పాల్గొన్నారు.

మామిడికుదురు: కనకుదుర్గా ఆటో యూనియన్, శ్రీవినాయక పెయింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బస్టాండ్ కూడలిలో మేడే వేడుకలు జరిగాయి. నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద జట్టు కార్మికులు మేడే జెండాను ఎగురవేశారు.

సఖినేటిపల్లి: స్థానిక భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కార్మిక జెండాను సంఘ ప్రెసిడెంట్ తోట వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. సంఘ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మలికిపురం: కార్మికుల చట్టాలను, హక్కులను కాపాడుకోవాలని సీపీఐ రాజోలు నియోజకవర్గ కార్యదర్శి దేవరాజేంద్రప్రసాద్ అన్నారు. మేడే సందర్భంగా దిండి గ్రామంలో అమరవీరుల స్థూపం వద్ద జెండా ఎగురవేశారు.

రావులపాలెం: స్థానిక శ్రమ సామిల్లు కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మే డే, పుచ్చలపల్లి సుందరయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు గుమ్మడి సత్యనారాయణ మే డే పతాకాన్ని ఆవిష్కరించారు.

ఆలమూరు: యూటీఎఫ్, సీఐటీయూ, సీపీఐ, సీపీఎం, యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, అంగన్‌వాడీ, అసంఘటిత కార్మిక సంఘాలు భారీ ర్యాలీ నిర్వహించాయి. ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జనం మెచ్చిన నాయకుడు జగనన్న

- ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు
- మాచవరంలో జోరుగా ఎన్నికల ప్రచారం

అంబాజీపేట: సంక్షేమ సారథి, జనం మెచ్చే నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపిస్తే.. సంక్షేమ పథకాలు కొనసాగుతాయని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. మాచవరంలో పార్టీ మండల అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావుకు అడుగడుగునా మహిళలు బ్రహ్మరథం పట్టారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఈవీఎంల్లో బటన్ నొక్కి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వేణుగోపాలరావు మాట్లాడుతూ పేద కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు రూపొందించారన్నారు. మరోసారి పేదవారి పక్షాన నిలబడేలా మేనిఫెస్టో రూపొందించారన్నారు. తమలో ఒకడిగా గుర్తించి ఎమ్మెల్యే అభ్యర్థి తనను, అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, ఎంపీటీసీ మట్టా పార్వతి, నాయకులు అప్పన శ్రీను, కుసుమ శ్రీను, కుడుపూడి సత్తిబాబు, కుసుమ వరలక్ష్మి, నందెపు సూరిబాబు, కోమలి సురేంద్ర, కోట సత్తిబాబు, వెన్నపు రాంబాబు, కుడుపూడి సతీష్ పాల్గొన్నారు.


మాచవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న విప్పర్తి వేణుగోపాలరావు


మాచవరంలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న విప్పర్తి

35 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరిక

మాచవరంలో పార్టీ మండల అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేనకు చెందిన 35 కుటుంబాల వారు వేణుగోపాలరావు సమక్షంలో బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి ఆయన ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు, పార్టీ మెగా మేనిఫెస్టోకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి అనేక మంది చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరి దేవి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు, నియోజకవర్గ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు, ముత్తాబత్తుల మణిరత్నం, పేరి శ్రీనివాస్, కొర్లపాటి కోటబాబు, ఉందుర్తి నాగబాబు, మట్టా వెంకటేశ్వరరావు, మట్టపర్తి హరి, మైలా ఆనందరావు పాల్గొన్నారు.

చంద్రరావు మృతికి సంతాపం

అంబాజీపేట: మాచవరానికి చెందిన సీనియర్ వైఎస్సార్ సీపీ, దళిత నాయకుడు క్రాప చంద్రరావు ఇటీవల ఆకస్మిక మృతి చెందడంపై ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు సంతాపం వ్యక్తం చేశారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, విప్పర్తి రామమోహనరావు, అప్పన శ్రీను, కుసుమ శ్రీను, పితాని శెట్టి, ఉందుర్తి నాగబాబు, కుడుపూడి సతీష్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

ప్రచారంలో దూసుకుపోతున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

అడుగడుగునా ప్రజల బ్రహ్మరథం

ఆలమూరు: కొత్తపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, స్థానిక ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. పెనికేరు, కలవచర్ల, మూలస్థాన అగ్రహారం గ్రామాల్లో జగ్గిరెడ్డి బుధవారం రాత్రి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్ వనుం చిన్నావతి, ఎంపీటీసీ యనమదల స్వాతి, పీఏసీఎస్ అధ్యక్షుడు గుత్తుల శ్రీనివాసు, గ్రామ కమిటీ అధ్యక్షులు జిత్తుక శ్రీనివాసు, కుడుపూడి లోవ సత్యనారాయణ, తోట శ్రీను ఆధ్వర్యంలో అపూర్వ స్వాగతం లభించింది. ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి పూలవర్షం కురిపించి, ప్రజలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేయాలని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. పెనికేరులో కర్రసాము చేస్తూ ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని ఆహ్వానించిన తీరు ఆకట్టుకుంది. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రజల ఆదరణ చూస్తుంటే వైఎస్సార్ సీపీదే మళ్లీ అధికారం వస్తుందనే నమ్మకం ఉందన్నారు. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, నెక్కంటి వెంకట్రాయుడు, మోటుపల్లి వెంకన్న, నల్లి రాజు, పెంటపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


పెనికేరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జగ్గిరెడ్డి


వైఎస్సార్ సీపీలోకి చేరిన వారికి పార్టీ కండువాలు వేస్తున్న జగ్గిరెడ్డి

వైఎస్సార్ సీపీలో చేరిక

రావులపాలెం: కొత్తపేట మండల జనసేన మాజీ అధ్యక్షుడు అంబటి పరమేశ్వరరావు, మరి కొందరు ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. పరమేశ్వరరావుతో పాటు, కేవీ రమణ, కముజు సత్యనారాయణ, తరిట్ల వరప్రసాదరావు, కంఠంశెట్టి లక్ష్మణరావు, పెచ్చెట్టి శ్రీనివాసరావు, నెల్లి జగన్ బన్ను, నల్లా రామకృష్ణ వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి జగ్గిరెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు, గూడపాటి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బర్లంకలో..

ఆత్రేయపురం: బొబ్బర్లంకలో ప్రతిపక్ష కూటమికి చెందిన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వారిని జగ్గిరెడ్డి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తానని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో కె.పవన్‌కుమార్, జె.సతీష్, రాయుడు భాస్కరరావు, పి.కాలేబు, చిట్టా జానీ, బోడే ఏసు తదితరులున్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని వారు పేర్కొన్నారు.

సంక్షేమ రాజ్యానికే ప్రజల పట్టం

వైఎస్సార్ సీపీ రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు

రాజోలు: రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో సంక్షేమ రాజ్యానికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. బుధవారం రాజోలు, శివకోడు, వేగివారిపాలెం, కూనవరం, ములికిపల్లి గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనకు, అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావుకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం చేపట్టారు. గొల్లపల్లి మాట్లాడుతూ ఏ గడపకు వెళ్లినా మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటామని హామీ ఇస్తున్నారన్నారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, సర్పంచ్‌లు రేవు జ్యోతి, నక్కా రామారావు, పప్పొప్పుల వెంకటలక్ష్మి, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, మాజీ ఎంపీపీ పాలపర్తి ధనలక్ష్మి, బీసీ సంఘ నాయకులు చెల్లుబోయిన రాంబాబు, గెద్దాడ స్వామి, ఏడుకొండలు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నేతల చేరిక

రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఆకర్షితులై బుధవారం శివకోడు, కూనవరం గ్రామాలకు చెందిన ఎస్సీ, బీసీ, కాపు సామాజిక వర్గాలకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. శివకోడు సర్పంచ్ నక్కా రామారావు, రాజోలు సొసైటీ మాజీ చైర్మన్ మేకల ఏసుబాబు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన బీసీ, కాపు సామాజిక వర్గ నాయకులు పార్టీలో చేరారు. అలాగే కూనవరం మాజీ సర్పంచ్ కలిగితి వెంకటేశ్వరరావుతో పాటు, దింపు, ఒలుపు కార్మికులు సుమారు 40 మంది పార్టీలో చేరారు. మాజీ సర్పంచ్ తాడి సత్యనారాయణ, జెడ్పీటీసీ మట్టా శైలజ, పార్టీ నాయకులు చెల్లింగి చినబాబు తదితరులు పాల్గొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ గెద్దాడ సత్యనారాయణ, పితాని నాగరాజు, పందే నాగశ్రీనివాస్ పాల్గొన్నారు.


రాజోలులో పార్టీ నాయకులతో కలసి ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న గొల్లపల్లి సూర్యారావు


తాటిపాకలో శివకోడు జనసేన, టీడీపీ నేతలను వైఎస్సార్ సీపీలో ఆహ్వానిస్తున్న గొల్లపల్లి

బట్టేలంకలో ఒలుపు కార్మికుల మద్దతు

మలికిపురం: బట్టేలంక గ్రామంలో మండల స్థాయి ఒలుపు కార్మికుల సమావేశం జరిగింది. కార్మికులంతా వైఎస్సార్ సీపీకి సంఘీభావం తెలిపారు. సూర్యారావు మాట్లాడుతూ అసంఘటిత కార్మికులందరికీ బీమా సౌకర్యం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. నాయకులు మోకా సురేష్, గొల్లమందల రాజబాబు, గొల్లమందల శ్రీను, గొల్లమందల సంజయ్, గొల్లమందల ప్రసాద్, నాగేశ్వరావు పున్నం, ఆధ్వర్యంలో జరిగిన పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో గొల్లపల్లి పాల్గొన్నారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, మంగెన సింహాద్రి, కొడవటి దొరబాబు, ఎంపీటీసీ చిట్టాల శ్రీనివాస్, ఉలిశెట్టి లక్ష్మణరావు, ఉదయ్ పాల్గొన్నారు.